క్లుప్తంగా

ఇల్లంతకుంట దేవస్థాన డైరెక్టర్‌గా నారాయణరెడ్డి



కమలాపూర్ : కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్‌గా కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రిక్కల నారాయణరెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4న ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్, కమలాపూర్ ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరవీందర్, వైస్ చైర్మన్ ఐలయ్యగౌడ్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని ఏఎంసీ చైర్ పర్సన్‌తో పాటు పలువురు నాయకులు సన్మానించారు.

కూతురే కొడుకై..



దామెర : మండలంలోని దామెర గ్రామానికి చెందిన ల్యాదెళ్ల భిక్షపతి(60) అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా అతనికి ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్ల సంతానం. కుమారుడు 18 సంవత్సరాల వయస్సులో మృతిచెందాడు. కూతుళ్లు వివాహాలు చేసుకుని అత్తగారిళ్ల వద్ద ఉంటున్నారు. తండ్రి మరణ వార్త విన్న కూతుళ్లు బోరున విలపిస్తూ ల్యాదెళ్లకు చేరుకున్నారు. కాగా తండ్రికి తలకొరివి పెట్టేందుకు కుమారుడు లేకపోవడంతో పెద్ద కుమార్తె శోభారాణి కుమారుడి బాధ్యతగా తలకొరివి పెట్టాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. మిగితా కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో శోభారాణి తండ్రికి తలకొరివి పెట్టి తండ్రి రుణం తీర్చుకుంది.

ఆర్థికసాయం, పరామర్శలు

ఆత్మకూరు : బాధిత కుటుంబానికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్‌లో ఇటీవల మద్దూరి మల్లమ్మ మృతిచెందగా ఆమె కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు సూదమల్ల రజనీకాంత్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. పరకాల మున్సిపాలిటీ 11వ వార్డుకు చెందిన రజనీకాంత్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీను, బీఆర్‌ఎస్ మహిళ పట్టణ అధ్యక్షురాలు కళావతి, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి దుంపేటి నాగరాజుతో కలిసి పరామర్శించారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని పెరుమాండ్లగూడెం గ్రామానికి చెందిన దుప్పెల్లి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ శనివారం రాజయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు తూళ్ల కుమారస్వామి, మార్గం భిక్షపతి, బజ్జేల్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో ఇటీవల మృతిచెందిన మైమూద్ పాషా కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.ఖాజా పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ కుటుంబాలకు అండగా ఉంటానన్నారు.కార్యక్రమంలో మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి కమాలొద్దీన్, నాయకులు సలీం, బాష, అజర్ తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాసమల్ల జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి శనివారం జనార్దన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట రాజిరెడ్డి, రమేశ్, శంకర్, కిరణ్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ భర్తపై కేసు

కమలాపూర్ : మండలంలోని వంగపల్లి మాజీ సర్పంచ్ భర్త పోడేటి సారయ్యపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 14వ తేదీన రాత్రి వంగపల్లికి చెందిన పోడేటి రవీందర్ కోడిగుడ్ల కోసం కిరాణా దుకాణానికి వెళ్తుండగా గ్రామ మాజీ సర్పంచ్ భర్త సారయ్య పాత కక్షతో బూతులు తిడుతూ రవీందర్‌ను రోడ్డుపై పడేసి కర్రలతో దాడి చేసి చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. బాధితుడు రవీందర్ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ కోసం తండావాసుల తిప్పలు

- నూతన గ్రామపంచాయతీల్లో కానరాని రేషన్ షాపులు
- ఉమ్మడి మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి
- బయోమెట్రిక్ సమస్య వస్తే రోజంతా పడిగాపులు



రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

వేలేరు : పరిపాలన సౌలభ్యం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తండాలను, చిన్న గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన గ్రామాల్లో అన్ని సౌకర్యాలు గ్రామాల్లోనే ఏర్పాటవుతాయని భావించిన ప్రజలకు నిరాషే మిగిలింది. ఏళ్లు గడుస్తున్నా స్థానికంగా రేషన్ షాపులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. గిరిజన తండాలు, పల్లెల్లో రేషన్ షాపులు లేకపోవడంతో ప్రతీనెల కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ బియ్యం తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందని, ఒక రోజంతా సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

14 పంచాయతీలకు 16 షాపులు

మండలంలో ప్రస్తుతం 14 గ్రామ పంచాయతీలకు 16 రేషన్ దుకాణాలు ఉండగా.. వీటి పరిధిలో 7,417 తెల్లరేషన్ కార్డులు, 425 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. మండల వ్యాప్తంగా మొత్తం 7,842 రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మండలానికి 1,42,141 కిలోల బియ్యాన్ని ప్రభుత్వం రేషన్ షాపులకు ప్రతీనెల సరాఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

కిలోమీటర్ల దూరం ప్రయాణం

మండలంలో కొత్తగా గొల్లకిష్టంపల్లి, చింతలతండా, బండతండా, లోక్యాతండాలు నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటయ్యాయి. ఈ గ్రామాల పరిధిలో రేషన్ దుకాణాలు లేకపోవడంతో ఉమ్మడి పంచాయతీల పరిధిలో ఉన్న రేషన్ షాపులకు వెళ్లి బియ్యం, ఇతర సరుకులు తెచ్చుకుంటున్నామని లబ్ధిదారులు అంటున్నారు. మండలంలోని కన్నారం శివారు ఇచ్చుళ్లపల్లి గ్రామానికి సూమారు 2 కిలోమీటర్ల దూరంలో రేషన్ షాపు ఉండగా.. గొల్లకిష్టంపల్లి, బంగ్లాపల్లి గ్రామాలు వేలేరుకు 3 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. లోక్యాతండా, మిరుపకుంట తండా, వేపల గడ్డతండా, లక్ష్మీతండా ప్రజలు శాలపల్లిలో, చింతల తండా, బండతండా, మాటుతండ గ్రామాలు కమ్మరిపేట పరిధిలో ఉండడంతో అంతదూరం వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం తీసుకునే క్రమంలో ఏదైనా సాంకేతిక లోపం తలెత్తినా, బయోమెట్రిక్ పనిచేయకపోయినా రేషన్ షాపు వద్దనే రోజంతా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త గ్రామపంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రేషన్ బియ్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

గ్రామంలోనే అందించాలి



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మా గ్రామాన్ని కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. గొల్లకిష్టంపల్లి, బంగ్లాపల్లి గ్రామాల్లో సూమారు 500 పైచిలుకు జనాభా ఉంటుంది. ప్రతీనెల రేషన్ బియ్యం, ఇతర సరుకుల కోసం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేలేరు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఒక్కోసారి బయోమెట్రిక్ పనిచేయకపోతే గంటల తరబడి అక్కడే ఉండాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా గ్రామంలోనే రేషన్ షాపు ఏర్పాటు చేయాలి.

- బత్తుల శ్రీనివాస్, గొల్లకిష్టంపల్లి గ్రామస్తుడు

శ్రీహరిని విమర్శించే స్థాయి కాదు



మాట్లాడుతున్న సద్దాంహుస్సేన్

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయకులది కాదని మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో అనేక అవినీతి, అక్రమాలు చేస్తేనే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య 15 ఏళ్ల అధికారంలో ఉండి నియోజకవర్గానికి చేసిందేమిలేదని విమర్శించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రులపై అసభ్యకరంగా మాట్లాడి అవమానించడం సరికాదని అన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రణధీర్‌రెడ్డి, నాయకులు సలీంమాలీక్, అరవింద్, ప్రశాంత్, శ్రీకాంత్, అజయ్, శివప్రసాద్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన కుంట వెన్నెల అనారోగ్యంతో బాధపడుతుంది. ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరగా స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షలు ఎల్‌ఓసీ మంజూరు చేయించినట్లు వెన్నెల తెలిపారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ కొనియాడారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- సాక్షి, నెట్‌వర్క్



ఐనవోలులో..



దామెర : పులుకుర్తిలో..



పరకాల : జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



శాయంపేటలో..



కమలాపూర్‌లో..



భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో..

డీజిల్ పోసుకుని ఉడాయించారు..



గుర్తుతెలియని వ్యక్తులు వచ్చిన కియాన్ కారు

నడికూడ : కారులో పెట్రోల్‌బంక్‌కు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.11 వేల డీజిల్ పోసుకుని డబ్బులు ఇవ్వకుండా ఉడాయించారు. ఈ సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బంకు నిర్వాహకకుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మాధవ ఇండియాన్ పెట్రోల్ బంక్‌కు నంబర్ పేట్ల్ లేని కియాన్ కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారని, రూ.11 వేల డీజిల్ పోసుకుని ఆన్‌లైన్ పేమెంట్ చేస్తామని ఫోన్ నంబర్ అడిగినట్లు తెలిపారు. పేమెంట్ చేయకుండానే కారులో వేగంగా వెళ్లిపోయినట్లు నిర్వాహకుడు తెలిపారు. వెంటనే డయల్ 100 కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

'మెపా' జిల్లా కమిటీ ఎన్నిక

హన్మకొండ: హనుమకొండ ఎన్జీవోఎస్ కాలనీలోని కార్యాలయంలో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా నూతన శనివారం కమిటీని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. అధ్యక్షుడిగా పులి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షుడిగా సదానందం, ఉపాధ్యక్షులుగా సుమన్, విజేందర్, సాంబయ్య, కార్యదర్శులుగా శ్రీను, సందీప్, కోటేశ్వరరావు, కోశాధికారిగా రణధీర్, కార్యవర్గ సభ్యులుగా విజయ్, క్రాంతికుమార్ ఎన్నికయ్యారని తెలిపారు.

గేదెను తప్పించబోయి చెట్టును ఢీకొన్న ఆటో

ఒకరికి తీవ్ర గాయాలు



కమలాపూర్ : గేదెను తప్పించబోయి ఆటో చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గూనిపర్తి వద్ద శనివారం రాత్రి చోటు ఈ సంఘటన చోటుచేసుకుంది. నడికూడ మండలానికి చెందిన 108 ఈఎంటీ సంజీవ్, పైలట్ పున్నంచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమారంకు చెందిన బదనాపురం పవన్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఆటోలో పరకాల నుంచి భీమారం వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గూనిపర్తి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఓ గేదెను తప్పించబోయి ఆటో రోడ్డు పక్కనేఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆటోలో డ్రైవర్‌తో పాటు ఐదుగురు ప్రయాణిస్తుండగా పవన్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నడికూడ మండలానికి చెందిన 108 సిబ్బంది క్షతగాత్రుడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఆత్మవిశ్వాసంతో విజయం తథ్యం



హన్మకొండ: క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో విజయం సాధించవచ్చని గ్రూప్ -1 రాష్ట్ర 9వ ర్యాంకర్, మల్టీ జోన్ -1లో 3వ ర్యాంకర్ కుడికాల భవ్య అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని నిత్య బాంక్వెట్ హాల్‌లో షైన్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా భవ్య పాల్గొని మాట్లాడుతూ తాను షైన్ స్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించానని గుర్తుచేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం ఆమెను షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్, డైరెక్టర్లు మూగల రమ, జక్కుల శ్రీనివాస్ సన్మానించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



ఎల్కతుర్తి : ముస్తాఫాపూర్‌లో..

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెంచికలపేట గ్రామంలో శనివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కోఆర్డినేటర్ కూచన రవళితో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రపన్నుతోందని ఆరోపించారు. కేంద్రం కుట్రను తిప్పకొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

ఎల్కతుర్తి : మహానీయుల ఆశయాలను కొనసాగించాలని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల్లాలోని పలు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్‌ని బీజేపీ నేతలు అవమానించారని ఆరోపించారు. పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగాన్ని అనగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అయిలయ్య, ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి నాయకులు ప్రకాశ్, చంద్రశేఖర్‌గుప్తా పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాతో యువతకు న్యాయం



మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పరకాల : పరకాల చరిత్రలోనే ఒకే రోజు 2వేల మందికి ఉద్యోగాలు ఇప్పించిన ఘనత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికే దక్కుతుందని, 60 కంపెనీలతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి పరకాల ప్రాంతానికి చెందిన అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి అండగా నిలిచారని పరకాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. మెగా జాబ్‌మేళా నిర్వహించినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేస్తునే ఉద్యోగాలు రాని వారిని నిరుత్సాహపర్చకుండా జాబ్‌మేళా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఔదార్యం



వృద్ధురాలితో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

ఐనవోలు : మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో ధీనస్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని రెండు రోజులుగా మండల కాంగ్రెస్ నాయకులు గమనించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన పున్నేలు గ్రామంలోని సహృదయ ఆనాధాశ్రమానికి తరలించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం ఆనాధాశ్రమానికి తీసుకెళ్లారు. కాగా ఎంతోమంది వృద్ధులకు ఆసరాగా నిలుస్తున్న నిర్వాహకులను మహ్మద్ యాకూబీ-చోటీను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్, జిల్లా నాయకులు రుగ్వేదరెడ్డి, సుధీర్, భాస్కర్, సునీల్, రహీం పాషా, అశోక్, కుమారస్వామి, రవీందర్, పరమేశ్ పాల్గొన్నారు.

కేంద్రం చొరవతో సన్నబియ్యం పంపిణీ



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్

దామెర : కేంద్ర ప్రభుత్వం చొరవతోనే రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ జరుగుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రమేశ్ అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో శనివారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమమే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమన్నారు. సన్నబియ్యం మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రతి రేషన్ షాపులో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు బత్తుల సుమంత్, కొలనుపాక సుధాకర్, నవీన్‌కుమార్, ప్రశాంత్, యశ్వంత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ముస్తాబు



కమలాపూర్ : ముస్తాబైన రామాలయం



దామెర : సీతారాంపూర్‌లో భక్తుల సందడి

కమలాపూర్ : శ్రీరామనవమి సందర్భంగా మండల వ్యాప్తంగా సీతారాముల కల్యాణానికి రామాలయాలు ముస్తాబయ్యాయి. కమలాపూర్‌తో పాటు ఉప్పల్, భీంపల్లి, శనిగరం, అంబాల, శ్రీరాములపల్లి, నేరెళ్ల, గూనిపర్తి తదితర గ్రామాల్లో గల రామాలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయా ఆలయాల అర్చకులు తెలిపారు. రామాలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించి కల్యాణానికి వచ్చే భక్తులకు నీడ కోసం చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేపట్టారు.

దామెర: సీతారాముల కల్యాణం సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గంగిడి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సీతారాములు విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, మహాగణాధిపతి పూజ, గౌరి పూజ, మంగళస్నానాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 11.30 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆయన వెల్లడించారు. తదుపరి మహాఅన్నదానం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం శోభయాత్ర ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మండలంలోని ఊరుగొండ, సీతారాంపూర్, పులుకుర్తి, పసరగొండ, కోగిల్వాయి ఆంజనేయ స్వామి ఆలయాల్లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయాల కమిటీ సభ్యులు వెల్లడించారు.

ఎల్కతుర్తి : శ్రీరామ నవమి సందర్భంగా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లోని కోదండ రామాలయాన్ని నిర్వాహకులు ముస్తాబు చేశారు. ఈ వేడుకలకు కావేరి సిడ్స్ అధినేత వనజ-భాస్కరావు దంపతులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆత్మకూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో, అక్కంపేట కోదండరామాలయంలో, గుడెప్పాడ్‌లోని రామాలయంతో పాటు వివిధ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.